

95
ధారావాహిక

# జాయ సేనాపతి

చారిత్రక కాల్పనిక నవల

మత్తి భానుమూర్తి ...
99893 71284

**జరిగిన కథ :** కంకుభట్టు గురుకులం దగ్గర కనిపించిన ఆ జలకన్య గురించి తెలుసుకోవాలని అనుకున్నాడు జాయపుడు. ఆరోజు సాయంత్రమే నాట్యారామం దగ్గరికి వెళ్లాడు. లోపలి నాట్యాంశాన్ని ఆసక్తిగా చూస్తున్న ఆ అమ్మాయికి ఏదో సంశయం కలిగి.. ఏట్లోకి దూకేసింది. ఆమె వెనకే నదిలోకి దూకిన జాయపుడు.. అవతలి ఒడ్డుకు చేరి, ఆమెతో మాట్లాడాడు. తనకు నాట్యమంటే చాలా ఇష్టమనీ, నేర్చుకుందామని వెళ్తే.. ఆ పంతులు రావొద్దన్నాడనీ చెప్పిందామె. తనకూ నాట్యం చేయడం వచ్చునంటూ.. గురుకులంలో చూసిన అంశాలన్నీ నర్తించి చూపించింది. దిగ్భ్రమతో కళ్లు చికిలించి చూసిన జాయపుడు.. అక్కడక్కడా తప్పులున్నాయనీ, వాటిని తాను సరిచేస్తాననీ చెప్పాడు.

మువ్వ.. విస్తుబోయింది. తప్పులున్నాయని అన్నందుకు కాదు.. ఆయనే 'నేర్పుతా! తప్పులు సరిదిద్దుతా!' అన్నందుకు.

''నాకు నేర్పుతావా.. అసలు నీకు వొచ్చా?'' అన్నది.. అనుమానపు సంభ్రమంతో!

జవాబివ్వకుండా కదిలి కొన్ని నాట్య భంగిమలు పెట్టి చూపాడు. ఆమె ఆనందంగా బిగ్గరగా నవ్వేసింది.

''సాల్లే.. సాల్లే! అబ్బో.. బాగావచ్చు నీకు..'' అన్నది.

జాయపుణ్ని నఖశిఖ పర్యంతం చూసింది.

''పిల్లాడివి. సర్వీసెట్టులాగా ఏపుగా ఎదిగావ్. నాట్టెం కూడా బాగా తొక్కుతున్నావ్. సరే సరే!'' అంటూ నవ్వుతున్నది.. వెన్నెల్లో పుచ్చపువ్వుల పొద కదిలినట్లు.

మాటిమాటికీ కాకతి గుర్తుకొస్తున్నది జాయపునికి. పెద్దగొంతుతో స్పష్టమైన అభిప్రాయ ప్రకటన. మాటలో, చూపులో మొగలిపువ్వు గరుకుదనపు ఆకర్షణ.

ఆమె అటూ ఇటూ చూస్తున్నది. ఎవరికోసమో వెతుకుతున్నట్లు గుర్తించి అడిగాడు జాయపుడు..

''ఎవరికోసం..?'' అంటూ.

''మా ఆయన. నాకోసం ఎదుకుతా వత్తాడు!''.

అప్పుడు చూశాడు. కాస్త బొద్దుగా, నిండుగా.. తనకంటే పెద్దది కావచ్చు. ఆమె వయసు, నాట్యాసక్తి, ఈతలోని చురుకుతనం.. మొత్తంగా నిర్భీకత్వపు స్త్రీమూర్తిమత్వం.

''కాస్త ముందే రావాలి.. ఈపాటికి నాట్టెం నేర్పడం అయిపోవాలి. మా ఆయనొచ్చి లాక్కుపోతాడు..'' అన్ని వైపులా చూస్తూ, అసహనంగా కదులుతున్నది.

''సరే సరే! నీ పేరు రాధ కదూ?''.

''యేవే.. మువ్వా! యాడ? ఇంకా అవ్వలేదా నీ తైతక్కలు?!''.. పెద్ద గొంతుతో అరుస్తున్నట్లు పిలుస్తూ వస్తున్నాడు.. మొగుడు కావచ్చు.

''ఇన్నవ్ గా.. మువ్వ! నాట్టెం ఆడేటప్పుడు కాలికి కట్టుకుంటారే.. మువ్వ! అది నాపేరు. ఎల్లు.. ఆడు సూత్తె పెద్ద గోల!''.

కదిలాడు. రేవులోకి వెళ్తున్నట్లు నడిచి ఆగి.. వెనక్కివెళ్లి ఓ పొదచాటుగా ఉండి చూస్తున్నాడు.

బలిష్టుడైన వ్యక్తి. నడుము నుంచి మోకాళ్ల వరకే ఉన్న పంచె. కంచుకంలేని విశాల వక్షం. తల గుడ్డ. భుజాన పలుగు.. దానికి తగిలించిన పార. బహుశా సగరుడు కావచ్చు. కాలువలు, చెరువులు తవ్వి తవ్వి బలిష్టమైన శరీరం.. చీకట్లో కూడా విస్పష్టంగా కనిపిస్తున్న జబ్బలు. ఆమె నడుమును చుట్టి చెయ్యి వేయగా.. ఇద్దరూ సాగిపో